క్లుప్తంగా

ఆర్థికసాయం

తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గాజుల రాజు(45) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. ఆయన వెంట అంకం రాజారాం, మాటూరి రమేష్, తాళ్లపల్లి పోషయ్య, అంకం శ్రీనివాస్, పర్మాని కొమురయ్య ఉన్నారు.

సన్మానం



బచ్చన్నపేట: కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు అందుకున్న మండల కేంద్రానికి చెందిన పాము రమేశ్‌ను మండల పద్మశాలి సేవా సమితి, శివభక్త మార్కండేయ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల డాక్టర్ కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును రమేశ్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



ప్రభాకర్‌రావు(ఫైల్)

బచ్చన్నపేట: నారాయణపురం మాజీ సర్పంచ్ ఎస్. ప్రభాకర్‌రావు(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన 1981–1988 వరకు సర్పంచ్‌గా పని చేసి గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని పలువురు ఆయన సేవలను కొనియాడారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రవీందర్‌రెడ్డి, కల్లూరి అనిల్‌రెడ్డి, జంగిటి నరేశ్, పరిదె భీమేష్, శ్రీనివాస్‌లు తదితరులు ఉన్నారు.

ప్రభాకర్ మృతి తీరని లోటు

జఫర్‌గఢ్: బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉద్దమారి ప్రభాకర్ అకస్మిక మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని తీగారం గ్రామానికి చెందిన ప్రభాకర్ అకస్మికంగా మృతి చెందడంతో విషయం తెలుసుకున్న రాజయ్య పార్టీ నాయకులతో కలిసి సోమవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పార్టీ పరంగా అన్ని విధాల ఆదుకుంటామన్నారు. మాజీ ఉప సర్పంచ్ సంపత్, మాజీ మార్కెట్ కమిటీ డైరక్టర్ పెంతల రాజ్‌కుమార్, లక్ష్మీనరసింహస్వామి, కుమార్, మైసయ్య, భిక్షపతి ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



పాలకుర్తి: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని అనుముల నర్సయ్యకు చెందిన ఆవు రోజుమాదిరిగా మేత మేస్తూ విద్యుత్‌వైరుకు తగలడంతో షాక్‌కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ. 45 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రేషన్ బియ్యం స్వాధీనం

దేవరుప్పుల: రేషన్ బియ్యం దందా చేసే వారిపై చట్టపరంగా చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని ధరావత్‌తండాలో ధరావత్ నిమ్మ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కానిస్టేబుల్ యాకేష్, కుమార్ ఉన్నారు. అలా గే జనగామ–సూర్యాపేట రహదారిపై ఆకస్మికంగా వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఫంక్షన్‌హాల్ యజమానులకు నోటీసుల జారీ



మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్ యజమానులకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఊర సృజన్‌కుమార్ మాట్లాడుతూ ఇక మీదట ఫంక్షన్ హాళ్లలో డీజే సౌండ్ సిస్టమ్ బాక్సులకు ఎలాంటి అనుమతులు ఉండవని, లౌడ్ స్పీకర్లు కూడా రాత్రి 10:00 గంటల వరకు మాత్రమే అనుమతించ బడుతాయన్నారు. కొత్త నిబంధనలను పాటించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



స్టేషన్‌ఘన్‌పూర్ సీహెచ్‌సీలో వైద్యుల అటెండెన్స్ రిజిస్టర్‌ను చూస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



పాలకుర్తి టౌన్: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

పాలకుర్తి టౌన్: వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధులకు హాజరు కాని వైద్యులను వెంటనే సస్పెండ్ చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అస్పత్రిని కలెక్టర్ సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వైద్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు, సీహెచ్‌సీ వైద్యుడిగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు విధుల్లో లేకపోవడంతో తక్షణమే సస్పెండ్ చేయాలని కలెక్టర్ వైద్య విధాన పరిషత్ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి రవీందర్, డీఆర్‌డీఓ, మండల ప్రత్యేక అధికారి వసంత, తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాలు, మండలంలోని గూడూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఆయన సందర్శించి భోజనాన్ని, స్టోర్ రూంలో సామగ్రిని పరిశీలించారు. అనంతరం రికార్డులను చూశారు. సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కూరగాయల్లో నాణ్యత లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయలు అందించే కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని సూచించారు. కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల సిబ్బందికి షోకాజ్ నోటీస్ అందించాలని ఆదేశించారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సహస్త్ర గురుకుల పాఠశాలలో ఉండబుద్ధి కావాడంలేదని కలెక్టర్‌కు చెప్పడంతో చిన్నారితో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. గూడూరు గిరిజన బాలికల పాఠశాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్‌డీఓ, మండల ప్రత్యేక అధికారి వసంత, తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, విద్యాశాఖ నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, ఆర్ఐ రాకేష్, ఆయ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ సీహెచ్‌సీ సందర్శన

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ను కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా సోమవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యులకు సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. సీహెచ్‌సీకి సంబంధించిన సూపరింటెండెంట్‌తో సహా ఆరుగురు డాక్టర్లకు గాను కలెక్టర్ సందర్శించిన సమయంలో(సాయంత్రం 4 గంటలకు) ఆరుగురు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఓపీ చూసేందుకు డ్యూటీ డాక్టర్ కూడా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో కలెక్టర్ స్వయంగా ఆరుగురికి ఆబ్సెంట్ వేశారు. గైర్హాజరైన వారికి తక్షణమే షోకాజ్ నోటీసులు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్శనలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రవీందర్, వైద్యులు డాక్టర్ జనార్దన్, అజయ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి



నర్మెట: పాఠశాలలో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

నర్మెట: వంటగదితో పాటుగా పరిసరాలను, గదులను పరిశుభ్రంగా ఉంచాలని, వంటలను మెను ప్రకారం నాణ్యతతో అందించాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. మాన్‌సింగ్‌తండాలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఆయన మధ్యాహ్న భోజనంతో పాటుగా వంటగది, తరగతిగదులు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున పరిశుభ్రతపై శ్రద్ధవహించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.మహిపాల్ రెడ్డి, ఆర్ఐ సాయిబాబ, ఎస్ఓ బైరోజు రజిత తదితరులు ఉన్నారు.

కోతకు గురైన రోడ్లపై వాహనాలు తిరగనీయొద్దు

చిల్పూరు: వర్షాల కారణంగా కోతలకు గురైన రోడ్లపై వాహనాలను తిరగనీయొద్దని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. వర్షాలకు కోతకు గురైన మండలంలోని పల్లగుట్ట–కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డును సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాలు తగ్గాక కోతకు గురైన రోడ్లకు మరమ్మతు చేయాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ కల్వల శ్రీనివాస్, ఇరిగేషన ఏఈ అభిరామ్, పంచాయతీ కార్యదర్శి బాపు నాయక్ తదితరులు ఉన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

నర్మెట: విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ఫ్రెండ్లీ పోలీస్‌లా వ్యవహరించాలని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆకస్మిక తనిఖీచేసిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై నైనాల నగేష్, ఏఎస్సై వెంకట్ రెడ్డి, పీసీలు కెంగెర్ల రమేష్, పల్లె ధనుంజయ్, ఎండి. హిదయతుల్లా, కాసరాజు రాజు, వినోద్ తదితరులు ఉన్నారు.

మత్తడి పోస్తున్న చెరువులు



దేవరుప్పుల: అలుగు పోస్తున్న చెక్‌డ్యామ్

దేవరుప్పుల/బచ్చన్నపేట్ల/రఘునాథపల్లి/కొడకండ్ల: భారీ వర్షానికి దేవరుప్పుల, బచ్చన్నపేట మండలంలోని చెక్ డ్యామ్‌లు, చెరువులు, కుంటలు నిండి మత్తడి పోస్తున్నాయి. వర్షానికి పలువురు రైతుల పంటలు నీట మునిగాయి. కాగా, ఇబ్రహీంపూర్‌లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి రైతులతో కలిసి పెద్ద చెరువు మత్తడిపై గంగమ్మ తల్లి, మత్తడి మైసమ్మ, కట్ట మైసమ్మలకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.

బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: హుస్నాబాద్ ప్రధాన రహదారి జనగామ మండలం గానుగుపహాడ్ జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈపరిస్థితి ఏర్పడిందని, బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. కాగా జిల్లాలో వర్షం కారణంగా కోతకు గురై, రాకపోకలకు ఇబ్బంది పరిస్థితులు ఏర్పడిన గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు సహాయం అందించాలని కోరారు.

రూ.30 లక్షలు నీళ్లపాలు

- కోతకు గురైన భాంజీపేట కాజ్‌వే
- నిర్మాణం చేపట్టి ఆరు నెలలే..



కోతకు గురై ప్రమాదకరంగా మారిన భాంజీపేట కాజ్‌వే

రఘునాథపల్లి: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు భాంజీపేట వాగు వద్ద రూ.30 లక్షలతో ఆరు నెలల క్రితం నిర్మించిన కాజ్‌వే కోతకు గురైంది. ప్రభుత్వం బ్రిడ్జికి బదులుగా కాజ్‌వే మంజూరి చేసింది. కాంట్రాక్టర్ 150 మీటర్ల పొడవున్న కాజ్‌వేకు కేవలం ఐదు లైన్లతో పైపులు వేసి ఇరువైపులా ప్రొడక్షన్ వాల్ నిర్మించారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి వరద ప్రవాహం పైపుల గుండా వెళ్లే పరిస్థితి లేక కాజ్‌వే పైనుంచి వెళ్లింది. దీంతో వాల్స్ కొట్టుకు పోయాయి. మరో వైపు కాజ్‌వే లోతుగా కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రహదారిపై వాహనాలు వెళ్లకుండా గ్రామస్తులు రాళ్లు అడ్డు పెట్టారు. దీంతో భాంజీపేట, శ్రీమన్నారాయణపురం, కన్నాయపల్లి, గబ్బెట ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ విషయమై ఆర్‌ఎన్‌బీ ఏఈ హుస్సేన్‌ను వివరణ కోరగా 'భాంజీపేట వాగు వద్ద నిర్మించిన కాజ్‌వే తాత్కాలికంగా వేసినదే. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు కాజ్‌వే స్థానంలో రూ.7 కోట్లతో బ్రిడ్జి నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధులు మంజూరవుతాయని భావిస్తున్నాం' అని పేర్కొన్నారు.

నాసిరకం పనుల కారణంగానే..



నాసిరకం పనుల కారణంగానే కాజ్‌వే నెర్రలుబారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. జనగామకు వెళ్లాలంటే రఘునాథపల్లి మీదుగా 10 కిలోమీటర్ల అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు పరిశీలించి నాణ్యత లేని పనులు చేసిన కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులపై చర్య తీసుకోవాలి.

– పగిడిపల్లి కృష్ణ, భాంజీపేట

హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాలి



గత ప్రభుత్వ వైఫల్యం కారణంగానే నాణ్యత లేకుండా నిర్మించిన కాజ్‌వే ఆరు నెలలకే నీటిపాలైంది. పేపులు తక్కువగా వేయడంతో వరద ప్రవహం కాజ్‌వే పైనుంచి రావడంతో వాల్స్ కొట్టుకుపోయాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. శాశ్వత పరిష్కారం కోసం హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి. ఇందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకరించాలి.

– రచ్చ సోమనాథ్, మాజీ ఎంపీటీసీ, భాంజీపేట

విద్యుత్ సిబ్బందిని అభినందించిన ఎస్‌ఈ



పాలకుర్తి టౌన్: భారీ వర్షాలకు వరదల ఉధృతికి విద్యుత్ తీగలు తెగడంతో ధైర్యసహసాలతో వరదలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ పునరుద్ధరించిన సిబ్బంది బాలాజి, పెద్దురి శ్రీనివాస్, లక్ష్మణ్‌లను సోమవారం ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ వేణుమాధవ్ శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యుత్ సిబ్బంది ధైర్య సాహసాలను అయన అభినందించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జఫర్‌గఢ్: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ మండల నాయకులు మచ్చ రమేష్, రడపాక దానియల్ కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అదేశాల మేరకు మండలంలోని తమ్మడపల్లి (ఐ), కూనూర్ తదితర గ్రామాలను వారు పార్టీ బృందంతో కలిసి సోమవారం సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. నాయకులు దాట్ల కార్తీక్, రడపాక రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బూత్‌కు 200 సభ్యత్వాలు చేయాలి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

రఘునాథపల్లి: మండలంలోని 54 బూత్‌ల్లో ఒక్కో బూత్‌లో 200 సభ్యత్వాల చొప్పున చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిడి వెంకట్‌రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ ఆధ్వర్యంలో ఆయన పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదును మూడు విదాలుగా చేసుకోవచ్చని, అందులో 88000 02024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి లింక్ ద్వారా, యాప్ ద్వారా, బూత్ అధ్యక్షులు ఇచ్చే ఫారం నింపి సభ్యత్వ నమోదును చేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాలు, వెంకటేష్‌యాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు లక్ష్మి, సభ్యత్వ నమోద్ ప్రముఖ్‌లు రాజు, అఖిల్, నాయకులు ఉన్నారు.

దివ్యాంగ లబ్ధిదారులకు ఉపకరణాలు

జనగామ రూరల్: అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఎంపిక కోసం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రై సైకిల్, మూడు చక్రాల రిక్షా, వీల్ చైర్, సహాయ కర్రలు, చేతి కర్రలు, హియరింగ్ ఎడ్స్, స్మార్ట్ కెన్ డివైసెస్, టీఎల్‌ఎం కిట్స్, 4జీ స్మార్ట్ ఫోన్‌లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 4వ తేదీన పాలకుర్తి రైతు వేదికలో నిర్వహించే శిబిరానికి కొడకండ్ల, దేవరుప్పుల మండలాలు, 5వ తేదీన స్టేషన్ ఘన్‌పూర్ రైతు వేదకలో జఫర్‌గఢ్, రఘునాథపల్లి, చిల్పూర్ మండలాలు, 6న జనగామ రూరల్, మున్సిపాలిటీ, లింగాలఘణపురం, నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల వారు కలెక్టరేట్‌లో శిబిరానికి హాజరు కావాలన్నారు. మూడు ఫొటోలు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

చిక్కిన వాలుగ చేప



చిల్పూరు: భారీ వర్షాల కారణంగా మండల కేంద్రంలోని చిల్పూరు వాగు ప్రవహిస్తోంది. సోమవారం ఉదయం నుంచే గ్రామస్తులు వాగులోని చెక్‌డ్యాం వద్ద చేపల వేటకు దిగారు. ఈక్రమంలో గద్దె రవికి పొడవైన 7 కిలోల బరువున్న వాలుగ చేప చిక్కింది.

జయప్రదం చేయండి

జనగామ రూరల్: సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించే అమరుల యాదిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని వడ్లకొండ గ్రామ పోరాట యోధుడు, అమరుడు వడ్లకొండ నరహరి స్తూపం నుంచి పక్షోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యాదగిరి, నరేందర్, అహల్య, నాయక్, ఉపేందర్ పాల్గొన్నారు.

తెగిన రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం

పాలకుర్తి: వర్షాలకు తెగిన రోడ్లకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సాయంతో మరమ్మతులు చేయిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. సోమవారం కొండపురం శివారు హనుమాన్ ఆలయ క్రాస్ నుంచి చందానాయక్ తండా వరకు తెగిన రోడ్డును నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట కుమారస్వామి, నారాయణ, తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

జనగామ రూరల్: జనగామ నుంచి నర్మెట వెళ్లే దారిలో గానుగుపహాడ్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు వెంటనే చేపట్టాలని బీఆర్‌ఎస్ నాయకుడు సిద్దిలింగం అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సిద్దిలింగం కొట్టుకపోయిన రోడ్డును ఆయన పరిశీలించారు. నాయకులు యాదగిరి, గాడిపెల్లి ప్రేమలత రెడ్డి, చిన్నబోయిన రేఖ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాటికొండ పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామంలో పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు.

దేవరుప్పుల: సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి పూజ సూచించారు. మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పలువురికి చికిత్సలు అందజేసి మందులు పంపిణీ చేశారు.

సామూహిక సీమంతాలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ మునిగాల రాణి ఆధ్వర్యంలో సోమవారం గర్భిణులకు సామూహిత సీమంతాలు నిర్వహించారు. కె.రాజేశ్వరి, రమ్య, రాధిక, సౌజన్య, ఆశ కార్యకర్త సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో చెరగని ముద్ర

సాక్షి నెట్‌వర్క్: ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన దివంగత మహానేత వైఎస్సార్ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని పలువురు వక్తలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొడకండ్లలో..



తరిగొప్పులలో..



చిల్పూరులో..



బచ్చన్నపేటలో..



దేవరుప్పులలో..



పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సతీష్ తదితరులు

మహా అన్నదానం

రఘునాథపల్లి/జఫర్‌గఢ్/పాలకుర్తిటౌన్: ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక చింతనను అలవర్చుకొని మానసిక ప్రశాంతతను పొందాలని మహాదేవస్వామి ఆలయ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ అన్నారు. సోమవారం అమావాస్యను పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే జఫర్‌గఢ్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రేవూరి ధనలక్ష్మి జయంతి పురస్కరించుకొని కుమారుడు హరినాథ్ అన్నదానం చేశారు. పాలకుర్తి సోమేశ్వరాలయంలో భక్తులు గొల్లపెల్లి సోమశేఖర్, రాజశేఖర్, రేపాల సారంగం దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయగా సూపరింటెండెంట్ వెంకటయ్య ప్రారంభించారు.

మత్తడి లీకేజీకి మరమ్మతు చేపట్టాలి

చిల్పూరు: గత సంవత్సరం పెద్ద చెరువు మత్తడి పనులు కాంట్రాక్టర్ నాసిరకంగా చేపట్టడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో లీకేజీ అవుతోందని వెంటనే అధికారులు మరమ్మతులు చేయించాలని మాజీ ఎంపీటీసీ ఎన్నకూస కుమార్ డిమాండ్ చేశారు. వెంకటాద్రిపేట గ్రామంలోని పెద్ద చెరువు మత్తడి లీకేజీని కుమార్ మాజీ సర్పంచ్ కందుల రఘుపతి, రైతులతో కలిసి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలకు చెరువులోకి వచ్చిన నీరు లీకేజీతో వృథాగా పోతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీ మరమ్మతులు చేయాలన్నారు. తోకల వెంకట్‌రెడ్డి, గోపు సంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, భిక్షపతి తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో పూజలు

బచ్చన్నపేట/చిల్పూరు: శ్రావణ మాస చివరి సోమవారం అమవాస్య సందర్భంగా కొడవటూర్ గ్రామంలోని సిద్ధేశ్వరాలయంలో భక్తులు పూజలను నిర్వహించారు. అలాగే చిల్పూరు ఫత్తేపూర్ బండల గట్టు పార్వతీపరమేశ్వరుల ఆలయంలో హనుమాన్ భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

పారిశుద్ధ్య పనులు

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య తెలిపారు. సోమవారం గ్రామంలో జేసీబీతో పిచ్చి మొక్కలను, ఎత్తుగా ఉన్న మట్టి కుప్పలను తొలగించారు.